


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## సాధారణ బహుమతి పొందిన నవల

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

“**మేము సెప్తునే ఉండాం ఇయ్యన్ని** పిల్లాటలు గాదని. నువ్వాడింటాండావు. పరమేశం సారే భయపడిపోతుండాడు. రేపు వోడు వచ్చి ఏం దుమారం లేపుతాడోనని. ఎవరు ఏంది అని సూసుకోకుండా నువట్టా రెచ్చిపోయి మాట్లాడితే ఎట్టా “ రుద్ర వెనక బండిలో కూర్చున్నాడు అతను.

“ఉరేయ్ బికారి అడుగు ముందుకేసినం. నాకు తెలుస్తుండాది రా వోడో వెదవని. వోడికి భయపడి మనం సేసే పని ఆపేయమంటావా. మనమే భయపడి సేతుల ముడుసుకొని కూర్చుంటే. ఇంగ వరదయ్యలాంటోడికి ఎవరు సహాయం సేస్తరు.. మనమేం భయపడాల్సిన పనిలేదు. వోడ్డాట్టా బూతులు మాట్లాడుతుంటే మనం నోరు మూసుకొని ఉండాలా అందుకే అట్టా మాట్లాడినా. రాని ఎంతమందిని ఎంటేసుక వస్తాడో. మీదికి వచ్చిండనుకో రెండు నిమిషాల్లో నలుగురి ముఖలు పగిలనాయంటే చుట్టు పక్కలుండరు ఎవరు. పోతా పోతా సిఐతో విషయం సెప్పి ఓ మాట మాటాడి పోతాం. వోడు రూలింగ్ పార్టిలో ఉంటే మనం దాంట్లోనే ఉండాం. మా నాయన్తో గూడా ఓ మాట సెప్తా “ అన్నాడు రుద్ర.

“ నువ్వు సానా సింపుల్గా తీసేస్తాండావు. నీకు భెయం లేదేమో గాని మేము భయంతో సచ్చిపోతుండాం. ఏం జరుగుతాదో ఏమో నని. జరిగినేది జరిగిపోయినాది. నువ్వు మరో సారి ఆలోచించరా. ఇదంతా మన కవసరమా?“ అన్నాడు బికారి మళ్లీ.

“బికారి ఈలా ప్రతొక్కడు మనకెందుకు మనకెందుకు అనుకోబట్టి అన్యాయాలకు అడ్డంలేకుండా పోతుండాది. మనకెందుకు అనుకొనే బదులు అన్నాయం జరుగుతుండాదని తెలిసి అడ్డుకొలేని మనమెందుకుండేది అని కొంత మందైనా అనుకొంటే పరిస్థితి ఇంత దిగజారిపోదు. నీకు గాని మిగతా వాళ్లు ఎవరైనా భయపడుతుంటే ఎవరు రానవసరంలే ఆదేదో నేనే సూసుకొంటా “అన్నాడు రుద్ర..

"నీకు ఎంత సెప్పినా తలకెక్కడంలా మీ నాయనకు జరిగినేది సెప్పు. ఆయన ఎట్టా సేయమంటే అట్టా సేస్తం "అన్నారు చివరికి అంతా కలిసి.ఎంకట్రెడ్డితో చెప్తే అబ్బిరెడ్డికి ఏదో ఒకటి సర్దుబాటు చేయడమో లేక రుద్రనే నాలుగుతిట్టి అబ్బిరెడ్డి జోలికి పోకుండా సేస్తాడని దాంతో సమస్య పరిష్కారమవుతుందని ఆశించారు రుద్ర స్నేహితులు.

సాయం సంధ్య వేళ చీకట్లు ముసురు కొంటున్నట్లు, చల్లగాలికి వామి దొడ్డి ముందున్న అరుగు మీద కూర్చున్న రుద్ర మనసులో ఆలోచనలు ముసురుకోసాగాయి . " అబ్బిరెడ్డిని తను అలా మాట్లాడి తప్పు చేసానా. వోడు ఓ మూర్ఖుడు అని తెలిసి కూడా తెలివిగా పనులు జరిగేలా చూసుకోవాలి కాని వోడిలాగ తను రెచ్చి పోయి మాట్లాడి ఉండకూడదు. వోడికి నాకు తేడా ఎముండాది. రేపేం జరగబోతుండాదో. పరమేశం సారు మిగతా తన స్నేహితులు చెప్పినట్లు పెద్ద గొడవే జరుగుతాది. ఎట్టా ఎదుర్కోవాల్సి వస్తాదో...నాయనకు విషయం సెప్తాం. అబ్బిరెడ్డి మీద తిరగబడిందానికి నాయనకు కోపం వస్తాందా. ఇషయం తెలిసినాక అబ్బిరెడ్డికి అట్టా మాటాడింది మా వోడే అని అబ్బిరెడ్డికి సర్దుబాటు చేసి చెప్తాడేమో....అప్పుడు వరదయ్యకు తామేమి సాయం సేయలేమోమో. నాయనకు చెప్పక పోవడం మంచిదా... "

" రెడ్డా...రెడ్డా.... " అన్న పిలపుతో తల తిప్పి చూసాడు రుద్ర. ఎర్రోడు పిలుస్తున్నాడు. ఎప్పుడొచ్చాడో గమనించలేదు రుద్ర వాడ్ని. వాడు పెద్ద చెంబు తీసుకోని పాలు పితికే ముందు దూడనిప్పబోతున్నాడు. వాడి పిలుపుతో . అంత వరకు సోకని మల్లెల వాసన ఆలోచనల్లోంచి బైటపడగానే ముక్కులకు గుప్పుమని సోకింది. ఎక్కడ్నుంచి ఈ వాసన అని వెనక్కి తిరిగి చూస్తే పక్కనే నిలబడి తన వంకే చూస్తున్న మేనమామ కూతురు సంధ్య కనపడింది. తన కళ్లలోకి సూటిగా చూస్తున్న సంధ్య చూపుల్తో తన చూపులు కలవడంతో తడబడ్డాడు. తలంటి పోసుకొందోమో ఆ కురుల వెనక ఆమె ముఖం , గాలికి చెల్లాచెదరవుతున్న నల్లని మబ్బులు మధ్యన పున్నమి చందమామలా వెలగిపోతు కనపడింది. తలలో విప్పారిన మల్లెపూలు వాసనే కాదు తెల్లగా వెలుగులు చిమ్ముతూ కనపడ్డాయి ఆ చిరుచీకట్లోను.

"సందెమ్మ పిలుస్తా వుంటే పలకవు ఉలకవు ఏమాలోచిస్తాండావేంది రెడ్డా" అన్న ఎర్రోడి మాటలకు సంధ్య వైపు నుండి చూపులు మరల్చుకొని "ఎంతసేపైంది వచ్చి సంధ్య?" అన్నాడు. బావ చూపుల్ను తనవైపునుండి మరల్చేలా చేసిన ఎర్రోడి మీద మనసులో కోప్పడుతూ.

"ఇప్పుడే బావ. అత్తనడిగితే నువ్వీడుండావని సెప్పినాది. నీకు ఓ మాట సెప్పి పోతామని వచ్చినా నీవోందో ఆలోచిస్తుండిపోతువి ఎన్ని మార్లు పిలిచినా పలక్కుండా" అంది బుంగ మూతి పెట్టుకొని.

"నాతో పనేంది. టౌనులో ఏమన్నా తేవాల్నా? " అన్నాడు సంధ్య వైపు చూడకుండానే.

"లే బావ "

"మరింకేంది..? "

సంధ్య , రుద్ర పిల్లప్పుటి నుండి కలిసి మెలిసి తిరిగారు. సంధ్యకు రుద్ర అంటే పిల్లప్పటి నుండి అభిమానం ,ప్రేమ. అది పెరిగి పెద్దదైంది. రుద్ర కాలేజి సెలవల్లో ఇంటికి వచ్చినప్పుడు అతనితో ఎక్కువ సమయం గడిపేందుకు లెక్కలు అర్థం కావడంలేదని చెప్పించుకోవాలన్న నెపంతో వచ్చేది. అలాగైనా రుద్ర తనకు దగ్గరైతాడని. కాని రుద్రకు ఆ అలోచన వచ్చేది కాదు..

" రేపు నా పుట్టినరోజు మిమ్మల్నందర్ని మా ఇంటికి భోజనానికి పిలవమని చెప్పింది మా అమ్మ.అత్త మామల్ను , అవ్వను పిలిచినా నువ్విడుండావంటే నీకు సెప్పిపోతామని వచ్చిన".

" అట్నా నీ బర్త్ డే అని నాకు తెలికపోయా. మండలానికి పోయింటి ఎందన్నా గిఫ్ట్ తెచ్చేటోన్ని కదా. సరేలే అమ్మా వోళ్లు వస్తారేమో గాని నాకు కొద్దిగా మండలంలో పని ఉండాది. ఒకేలా పనైపోతే వస్తాలే ఇంగ నువ్వెళ్లు సీకటి పడుతుండాది. " అన్నాడు రుద్ర, సంధ్య అక్కడుండటం ఇష్టం లేనట్లు.

సంధ్య కదలక పోయేసరికి " ఏం ఒంటిగా పోలేవా? " అడిగాడు రుద్ర.

సంధ్య రుద్ర వస్తాడేమోనని అశపడుతూ "ఆ... " అంది.

"ఇంట్లోకి పో ఓ పది నిమిషలాగినాక ఎర్రోడు పాలు పితికి వచ్చి దిగ పెడ్తాడు" అన్నాడు రుద్ర. నిరాశ పడింది సంధ్య.

"ఇంగా పదినిమిషాలా,నువ్వొస్తావేమో రా లేకుంటే ఆలస్యమైతాది నేనే ఎళ్తా" ఆశ చావక అడిగింది సంధ్య.

"సరే ఉండు ఎర్రోడే నిన్ను దిగబెట్టివచ్చినాకా పితుకుతాడేలే పాలు" అని ఎర్రోడికి చెప్పబోతుంటే ,

"ఎర్రోడేం అక్కర్లేదులే నేనెళ్తే గాని నువు తప్పకుండా రా బావ" అని మరొకసారి చెప్పి అఇష్టంగానే వెళ్లిపోయింది సంధ్య.

సంధ్య వెళ్లిపోగానే మళ్లీ అరుగు మీద కూర్చున్నాడు రుద్ర. దూడ పాలు తాగుతుంది. చెంబు పట్టుకొని తననే చూస్తున్న ఎర్రోడ్ని చూడగానే ఫోన్ చేసే విషయం మరిచిపోయి, "నిన్నొకటి అడుగుతుండా.సొంతం తెలుస్తే చెప్పు.లేకుంటే తెలీదని సెప్పు "అన్నాడు రుద్ర.

రుద్ర ఉండటంతో దూడను పూర్తిగా పాలుతాగనిస్తున్న ఎర్రోడు "ఏ ఇషయం రెడ్డా సందెమ్మ ఇషయమా? "అన్నాడు.

"ఛత్...సంధ్య ఇషయమేముండాది...నువ్వు సెప్పేదానికి..నేను ఇనేదానికి ".ఏదోదో ఊహించుకొన్న ఎర్రోడు కంగుతింటూ "మరే ఇషయం "అన్నాడు.

"వరి పైరు నీళ్లలో మునిగితే సచ్చిపోతాదా...ఎన్ని దినాలకు సచ్చిపోతాది. "

"నిండా మునిగి పోయేదాక మనమెందుకు పెడ్తం రెడ్డి ఒకేలా వానలు పడి నీళ్లెక్కువైతే గట్టు తెగ్గొట్టి క్రిందికి వదిలేస్తం గాని"

వాడి జవాబుకు కోపమొస్తుండగా ".నేనడిగేంది నువ్వు సెప్పేదేంది. పైరు నీళ్లలో మునిగితే సచ్చిపోతాదా సస్తే ఎన్ని దినాలకు సస్తది. "అన్నాడు వత్తి పలుకుతూ.

"అది పైరును బట్టి ఉంటాది రెడ్డా లేతదైతే తొరగా సత్తది. లేదంటే కొద్దిగా నిదానంగా సత్తది. " వాడి మీద కోపం ముంచుకొస్తుండగానే...వయసులో తన కన్నా కొద్దిగా పెద్దవాడు కాబట్టి కోపాన్ని అణుచుకొంటూ మళ్లీ అడగబోయేంతలో ఇంట్లోనుండి రుద్ర అవ్వ గొంతు వినపడింది.

"అరే రుద్ర నీ ఫోనేమో ఒకటేమైన మోగుతుండాదిరా. నీకాడ పెట్టుకొకుండాలోపలెందుకు పెట్టినావు. మీ అమ్మ లోపల్యాడ్నో ఉండాది. ఎవరో సూడు ఫోన్" అంది.

రుద్ర ఆమె కెదురుగా పోయి ఫోన్ తీసుకొని చూసాడు. చాలా మిస్డ్ కాల్స్. తన తండ్రి దగ్గర నుండి ఏదో పొలిటికల్ మీటింగ్ ఉందని విజయవాడ వెళ్లాడు. ఏమై ఉంటది ఎప్పుడు లేంది ఇన్ని కాల్స్. బహూశా అబ్బి రెడ్డి విషయం ఆయనకు తెలసిపోయిందా లేక డాక్టరు చూపించుకొంటే వాళ్లేమైనాచెప్పారా అనుకొంటూ పోన్ చేయబోయంతలో మరో సారి రింగ్ అయ్యింది ఫోన్. ఫోన్ లిఫ్ట్ చేసి హల్లో అన్నాడు సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో కొద్దిగా బైటికి వచ్చాక."హల్లో ఎవరు మాట్లాడేది. " అని వినపడింది అవతల వైపునుండి. అది తన తండ్రి గొంతు కాకపోవడంతో కంగారు పడుతూ " మీరెవరు మా ఫాదర్ ఫోన్ మీకాడ ఎందుకుండాది "అన్నాడు రుద్ర. " హమ్మయ్య చాలా సేపునుండి ప్రయత్నిస్తున్నా బాబు ఫోన్ ఎత్తలేదు మీరు. "అన్నాడు అవతల వ్యక్తి.

"ఏమైంది. ఇంతకు ఎవరు మీరు. మా ఫాదరెక్కడ " ఆందోళన పడుతూ.

"నా పేరు రాజేంద్రబాబు మీ ఫాదర్ స్నేహితుడ్ని. మీ ఫాదర్ ఇక్కడే ఉన్నాడు. ఏమిలేదు. చిన్న అస్వస్థతకు గురైతే హాస్పెటెల్లో చేర్పించాను. "

అదిరి పడ్డాడు రుద్ర. కీడు శంకించింది మనసు. గొంతు వణుకుతుండాగా ఆదుర్దాగా ,

"ఏమైనాది మా నాయనకు" అన్నాడు.

"మీటింగ్లో ఉండగా చాతీలో నొప్పి అని పడిపోతే వెంటనే హాస్పెటెల్లో చేర్పించాం. మైల్డ్ హార్ట్ స్ట్రోక్ వచ్చినట్లుంది. డాక్టర్లు టెస్ట్ చేసారు. ప్రమాదమేమి లేదని చెప్పారు.మీరు భయపడాల్సిన పనిలేదు. ఇంటెనిసివ్ కేర్లో ఉన్నాడు. కొద్ది సేపట్లో మీ ఫాదర్ తోనే మాట్లాడిస్తాను. కంగారు పడకు. మీ అమ్మగారికి విషయం చెప్పి కంగారు పెట్టద్దు. ఏదో ఒకటి చెప్పి వెంటనే బైలుదేరి రండి"

కాళ్లు చేతులు ఆడలేదు. మెదుడు మొద్దుబారింది. నిస్సత్తువుగా కూలబడిపోయాడు. క్షణకాలం తర్వాత తేరుకొని “మా ఫాదరకేమి కాలేదు కదా నిజం సెప్పండి ఆయనకు ఏమి కాలేదుగా.. “.అదే మాట పదే పదే కంఠం దుఖంతో బూడిపోతుండగా అడిగాడు రుద్ర.

“నో…నో నిజం చెప్తున్నా మీ నాన్న కు ఏమి కాలేదు. ఏమి కాదుకూడా….మైల్డ్ స్ట్రోక్….వెంటనే హాస్పిటల్ లో చేర్పించడం వల్ల ప్రమాదం తప్పింది. పెద్ద డాక్టర్లు అందు బాటులో ఉన్నారు. భయపడాల్సిన పనిలేదు. త్వరగా వచ్చేయండి.మీరు వస్తే మీ నాన్నకు కొద్దిగా ధైర్యం వచ్చినట్లుంటుంది“ అని ఫోన్ పెట్టేసాడు.

రుద్రకు వళ్లంతా చెమటలు పట్టసాగాయి. తనకు తెలియకుండా వళ్లంతా వణక సాగింది. ఏమి చేయాలో దిక్కుతోచలేదు. తండ్రికి బాగలేకపోవడం ఒక పక్క , మరో పక్క ఆ విషయం అమ్మకు చెప్పాలా వద్దా విజయవాడకు పిలుచకపోవాలా వద్దా….విషయం చెప్పి ఆమెను విజయవాడకు తీసుకపోవాలో అర్థం కాక సతమతమైపోయాడు.ఒక వేళ నిజం చెప్తే ఆమె తట్టుకోలేదు. తట్టుకొన్నా విజయవాడ వరకు ఆమెను ఓదార్చడం సాధ్యంకాదు.మళ్లీ ఆమెక్కూడా ఏదైనా అయితే అనుకొంటు లోలోపల బాధను దిగమింగుకొంటుండగా ఓ ఆలోచన మదిలో మెదిలింది. తనను తాను కంట్రోలు చేసుకొన్నాడు.తర్వాత , “అమ్మ…..అమ్మ. “ అంటూ కేకేస్తు లోపలికి నడిచాడు. “ ఏమైందిరా ఏమిటా గావుకేకలు“ అని రుద్ర నాయనమ్మ అంటే“ రా చెప్తాను రా “అంటూ ఆమెను వంటగదిలోకి తీసుకపోయాడు. వంట పూర్తి చేసి బైటికి వస్తున్న సావిత్రమ్మ “యామైనాది అట్టా సిన్న పిల్లాడిలా అమ్మా అమ్మా అంటు అరుస్తు వస్తుండావు ఉసి పోకుండా “ అంది. ఆమె కళ్లోలోకి సూటిగా చూడకుండా పక్కకు చూస్తునే “ నాయన ఫోన్ చేసిండు అర్జంటుగా మనం విజయవాడ పోతుండాం. నువ్వు ఎప్పుడ్నుంచో కనకదుర్గమ్మను సూడాలని అనుకొంటుండావట గందా నాయన సెప్పిండు. ఆడ నాయనకు ఇంకా రెండురోజులు పని ఉందంట వెంటనే నిన్ను అవ్వను ఎంటెట్టుకొని రమ్మని ఫోన్ చేసిండు. తొరగా రెడీ కాండి. బైల్దేర్దాం “అని తొందర పెట్టాడు“.ఇదేందిరా ఉరుములు మెరుపుల్లేకుండా ఉన్నట్టుండి వచ్చే వానలాగా. ఇప్పటికప్పుడు అంటే ఎట్టా అందరం పోతే ఇంట్లో ఎట్టా. “అంది సావిత్రమ్మ.

“ఇల్లు యాడికి పారిపోదు. ఆయన సెప్పక సెప్పక సెప్పిండు. ఎర్రోడికి సెప్పి ఒకరిద్దిర్ని ఈడ్నే పడుకోమని సెప్తాం. ఎవరు పనులు వోళ్ల సూసుకొంటారు.మనమీదలేక పోతే ఏం కొంపలంటుకోవులే. రెడికాపోండి అట్నే డబ్బలేమన్న ఉంటే పట్టుకరా. నేను కారు రెడి సేసి తీసుకొస్తా.పది నిమిషాల్లోరెడి గావాలి “అని తన దగ్గరున్న ఏటిఎం కార్డును తీసుకొని మనుసులో కలవరపెడుతున్నా బాధను బైటికి పడనీయకుండా పరుగుల్లాంటి బైటికి నడవబోతుంటే,

“అదికాదురా“ అని అడ్డుతగిలిన అమ్మ మీద విపరీతమైన కోపం ముంచుకొంచింది. “ ఏందమ్మ చెప్తే అర్థంకాదా.. అడ్డుసెప్పకుండా తొరగా తయారుకా “అన్నాడు. కోపాన్ని ఎంత కంట్రోలు చేసుకొన్న మాట విసుగ్గా వచ్చింది. ఎప్పుడు అంత కటువుగా మాట్లడని రుద్ర అలా మాట్లడటంతో బిత్తరపోయింది సావిత్రమ్మ. అప్రయత్నంగా ఆమె కంట్లోనీళ్ల చిప్పిల్లాయి. వెంటనే తను చేసిన తప్పేమిటో తెలుసుకొని తల్లి వైపు చూచిన రుద్ర ఆమె కంట్లో నీళ్లను చూచి

చలించిపోయాడు. పాపం ఆమెకేమి తెలుసు తండ్రికి బాగోలేదన్న సంగతి అనుకొంటూ ".నాన్న మనల్ని ఎంత బేగిన ఈలైతే అంత బేగిన రామని సెప్పిండు. అందుకే అట్టా అన్నా " అని ఆమెను బ్రతిమాలుతూ ఊరడించాడు. మరోపక్క మళ్లీ ఫోన్ వస్తుందేమో.ఏలాంటి వార్త వినాల్సి వస్తుందేమో నని భయమేయసాగింది అతనికి.

పరమేశం కూడా ఆఫీసులో ఎక్కువ సేపు ఉండలేదు. రుద్రవాళ్లు వెళ్లగానే తను టేబులుమీది కాగితాలు సర్దేసి బైటకి వచ్చేసాడు. మనసులో అబ్బిరెడ్డి ఏదో చేయబోతాడో అని మనసులో మొదుల్తుంటే ఇంటికి క్కూడా పోలేదు. ఇంటి వద్దనున్న ఉన్న హోటల్లో పోయి కూర్చున్నాడు. చేతిలోకి వారపత్రిక తీసుకొని నిమిషానికొకసారి తన ఇంటి వైపు చూడసాగాడు. ఓ పది నిమిషాలు గడిచాయి. అతను అనుకొన్నట్లే ఓ పాతిక నిమిషాల్లో ఓ అయిదు మంది మోటర్ బైక్లో తన ఇంటి దగ్గరికి రావడం తను ఇంట్లో లేదని తెలుసుకొని వెళ్లిపోవడం జరిగింది. తను ఫోన్ స్విచ్చాఫ్ చేయడంతో ఆఫీసు దగ్గర చూసి లేదని ఇంటి దగ్గరికి వచ్చినట్లుంది వాళ్లు తనకు తెలిసిన వాళ్లే రుద్ర ఆచూకి అడిగేందుకు వచ్చింటారు. అబ్బిరెడ్డి రుద్ర మాటలకు అంత తేలిగ్గా తీసుకోడని వరదయ్యకు మంచి జరగడం అటుంచి మరింత నష్టమే జరుగుతుందేమో అనిపించసాగింది పరమేశానికి. మరో అరగంట లైబ్రరీలోనే గడిపి ఇంటి దారి పట్టాడు. ఎందుకైనా మంచిదని బైక్కు ఇంటి ముందు కాకుండా పక్కన కనపడకుండా పెట్టాడు.

అలోచన్లతో సతమతమౌతు దిగాలుగా ఉన్న పరమేశాన్ని చూసి చూడగానే " ఏం జరిగింది మళ్లీ మనం మూటా ముల్లే సర్దుకోవాల్సిందేనా " అంది నవ్వుతూ పరమేశం భార్య విషయాన్నితేలికచేస్తూ. జవాబుగా తను నవ్వేసాడు పరమేశం.

ఆరై పరమేశం నిజాయితీ పరుడు. అతని తండ్రి నిజాయితి గల పోలీస్ ఆఫీసర్. తల్లి అతని అడుగు జాడల్లోనే నడిచేది. వాళ్లు నిజాయితి వల్ల జీవితంలో ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొన్నా ఆశయాలను మాత్రం వదులుకోలేదు. పోతూ పోతూ వాళ్లు పరమేశానికి నిజాయితిని నిస్వార్థాన్ని వారసత్వంగా ఇచ్చిపోయారు తప్ప ఆస్తిపాస్తులేమి ఇవ్వలేదు. తల్లి తండ్రుల అడుగుజాడల్లోనే నడుస్తున్న పరమేశానికి మారిన కాలంతో పాటు దిగజారిన మనుష్యుల అవినీతి, ఆశ్రిత పక్షపాతం ,రాజకీయనాయకుల అధికారం మదం వృత్తిపరంగా ఇబ్బంది పెట్టసాగింది. అయినా వెరవని పరమేశం వృత్తిపరంగా తన చేతనైనంత అందరికి సహాయం చేస్తూ , చేయలేని చేయకూడని పనులు చేయాల్సవచ్చినప్పుడు వాటిని ఎదుర్కొనే శక్తి లేనప్పుడు మధ్యే మార్గంగా సెలువల్లో వెళ్లిపోతున్నాడు. మైదుకూరు వచ్చి ఓ ఆరు నెలలు కావచ్చింది.ఇంత వరకు తనకు సెలవులో వెళ్లాల్సిన అవసరం రాలేదు. కాని ఇప్పుడు ఆ పరిస్థితిలు వస్తున్నాయోమో అనిపించసాగింది మళ్లీ తనకోసం ఎవరైనా వస్తారేమో నని మనసులో మెదుల్తుండగా రుద్ర గురించి అతను ఎవరో అతని బ్యాక్ గ్రౌండు ఏమిటో తెలుసుకొని ఉంటే బాగుండు. అతని తల్లి తండ్రులకు ఇతను చేసే పని తెలుసోతెలియదో అతని వల్ల వాళ్లు ఇబ్బంది పడ్తారా అనుకొంటూ ఫ్రెష్ అయి కాఫీని పైకి తీసుకరమ్మని భార్యకు చెప్పి డాబా ఎక్కాడు.

పరమేశాన్ని రాకనుకూడా గమనించని స్థితిలో  చదవడంలో మునిగిపోయి ఉంది నిర్మల. పరమేశం పెద్ద కూతురు. కొడుకు చందు  పక్కనే కూర్చుని సెల్ చూస్తున్నవాడల్లా.తండ్రి రాకతో ఎప్పుడు అంత త్వరగా ఇంటికి రాని అతను రావడమే కాకుండా తమ దగ్గిరికి రావడం ఆశ్చర్యపోతూ "రండి నాన్న " అన్నాడు. అప్పుడుతలెత్తి చూచింది నిర్మల తండ్రి వైపు. పరమేశం అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుంటూ, "ఏదైనా ఎగ్జామ్కు ప్రిపేరవుతున్నివా?" అడిగాడు పరమేశం. నిర్మలది రుద్ర ల్లాంటి పరిస్థితే కాకపోతే ఆమె గ్రూప్ 1 ప్రిలిమ్స్ మేయిన్ తో పాటు ఇంటర్వ్యూ కూడా పూర్తి చేసింది.

"అవున్నాన్నా ఖాళీగా ఉండటమెందుకని  బ్యాంక్ టెస్ట్ కు అప్లైచేసాను" అంది నిర్మల లేచి వచ్చి తండ్రి పక్కనే కూర్చుంటు.తన పిల్లల  చదువుల సంగతి భార్యకే వదిలేసాడు.10 +2 కాగానే ఆమె కూడా వాళ్ల బాధ్యత వాళ్లకే వదిలేసింది. నిర్మలకు రెవిన్యూ లేదా పోలీస్ డిపార్టు మెంటులో పని చేయాలని ఆశ. కాని రోజురోజుకు దిగజారిపోతున్న పరిస్థితి.ఒక వేళ నిర్మలకు రెవిన్యూలో గాని పోలీస్ డిపార్ట్ మెంట్లోకాని పోస్టింగ్స్ వస్తే  తను నెట్టుకరాగలగుతుందా ఇబ్బందులు పడుతుందేమో  అన్న ఆలోచనలో తలమునకలవుతుంటాడు అప్పడప్పుడు.అయినప్పటికి ఆమె ఇష్టానికి వ్యతిరేఖంగా ఎప్పుడు మాట్లడలేదు.

"రెవిన్యూ పోలీసు డిపార్టమెంటును వదిలి బ్యాంక్ ల మీద పడ్డావా?"

"మెదుడు పదును పెడ్తూనే ఉండాలి నాన్న లేకుంటే మొద్దుబారి పోతుంది. ఖాళీగా ఉండటమెందుకని అప్లైచేసానంతే కాని ఆశ, ఆశయం మాత్రం పోలేదు. నీ కూతుర్నే కదా" అంది నవ్వుతూ.పరమేశం  ప్రతిగానవ్వాడు. వాళ్లతో మాట్లాడుతున్నా మోటార్ బైక్ శబ్ధం వచ్చినప్పుడల్లా డాబా ముందుకు వెళ్లి క్రిందికి చూడటం గమనించి,

నిర్మలకు ఆఫీసులో ఏదో జరిగిందనిపించింది.  ఇంట్లో తల్లి పిల్లలందరికి  తెలుసు వృత్తి పరంగా పరమేశం ఎదుర్కొంటున్న సమస్యలు. భయం భయంగా నే ఉంటారెప్పుడు ఎప్పుడు ఏం వినాల్సివస్తుందో నని.

భార్య తెచ్చిన కాఫీతాగుతూ, రుద్ర గురించి  అతను తన పరిచయం...పాంప్లెట్టు వేయడం గురించి...అబ్బి రెడ్డి ఫోన్లో మాట్లడటం దానికి ప్రతిగా రుద్ర మాట్లడటం అన్ని వివరంగా చెప్పాడు.

"ఇదేదో సిన్మా కథలాగుంది నాన్న.. లేక పోతే ఈ రోజుల్లో కూడా ఈలాంటి వాళ్లన్నారా" అంది ఆశ్చర్య పోతూ నిర్మల.

"రుద్రను మీరే తీసుకొచ్చారని అబ్బిరెడ్డి అనుకొంటున్నాడేమో. ఆ అబ్బాయి అంటే ఈ మండలంలో వాడు. వాళ్లు వాళ్లు క్రిందా మీద పడ్తారు. రేపొద్దున్న అబ్బిరెడ్డి మీ మీద విరుచుకపడ్తాడేమో "అంది ఆందోళనగా పరమేశం భార్య.

ఆ ఆందోళనలో నిజముందనిపిస్తున్నా "నామీదికి ఎందుకు వస్తాడులేవే" భార్యకు సర్ధిచెప్పాడు. అనవసరంగా ఆమెలో భయం కలిగించడం ఎందుకని.

"రుద్రగురించి  ఆలోచిస్తూ అతనికోసం మీరు ఇబ్బందిలో పడకండి. ఇప్పుడిప్పుడే కాలేజినుండి బైటికి వచ్చినవాడికి తమ తోటి విద్యార్ధులతో అంతో సంబంధముండి ఉంటుంది.. మీరు హాయిగా రిలాక్స్ అవ్వండి" అని

పరమేశానికి బరోసా ఇచ్చింది నిర్మల. కాని పరమేశం మనసులో ఏదో భీతి వెంటాడుతునే ఉంది. మూర్ఖుడు బలవంతుడు అయిన అబ్బిరెడ్డి ఏలా చెలరేగిపోతాడో ఏమో రేపేం జరగబోతుందో అనే ఆలోచన అతన్ని కలవర పెట్టసాగింది..

ఆఫీసు దగ్గర రుద్ర వాళ్లతో తన బాధను చెప్పుకొని అటునుండి అటే పొలం దగ్గరికిపోయాడు వరదయ్య. పొలంలో నీళ్లు తగ్గి పైరు పైకి కనపడతుండటంతో స్తిమిత పడ్డాడు. కడుపులో ఆకలి తెలిసి వచ్చింది. ఇంటికొచ్చి స్నానానికి పోతూ భార్యతో తనకిష్టమైన ... ఉప్పు సేపలు వేయించి , పప్పుకూర చేయమన్నాడు. నీళ్లు పోసుకొచ్చిన వరదయ్య ముఖంలో చాలా దినాల తర్వాత సంతోషం కనపడతుండటంతో భార్య పిల్లలకు ఏం జరిగిందో తెలియక తనవైపు వింతగా చూస్తుంటే "ఏందే తిక్కోళ్లాగా అంటా సూస్తుండారు ఏమిలే ఇప్పుడే పొలం కాడికి పోయెచ్చినా సగానికి పైగా నీళ్లు తగ్గిపోయినయి.. పైరు గూడా పడి పోకుండా నిటారుగా నిలబడిఉండాది. ఇంగ పైరుకేమి గాదు. "

"అంతా అంకాళమ్మ తల్లోరి దయ పైరు బాగుంటే సాలు "అంది, చేతులు రెండు పైకెత్తి ఆకాశంలోకి చూస్తూ దండం పెడ్తూ వరదయ్య భార్య.

"అంతేకాదే ఈ యాలా ఇంకోటి అనుకోకండా జరిగినాది "అంటూ ఆరోజు జరిగినదంతా ఉత్సాహంగా చెప్పుకొచ్చాడు వరదయ్య. " ఎవడు కన్న బిడ్డడో మనకు తోడుంటానన్నాడు. నాకు జరిగిన అన్నాయానికి ఎదురొడ్డి నిలుస్తానన్నాడు. రేపు ఆఫీసుకాడికి రమ్మనిండు మనకు న్నాయం జరిగేలా సూస్తానని సెప్పిండు. "

వరదయ్య మాటలు సంతోషం కలిగిస్తున్నా "అబ్బిరెడ్డి సంగతి తెలిక అట్టా అనిండేమో "సందేహం వ్యక్తం చేసింది ఆమె.

"తెలీకేందే తెలిసే మాటాడిండు. వోడితోనే డైరక్టుగా నా సెమడాలేం తీస్తవు గాని నీ సెమడాలు తాసిలిదారు సెమడాలు ఊడకుండా సూసుకో అని మాటాడిండు. అని గట్టిగా మాటాడిండే పులిబిడ్డ పులిబిడ్డలాగున్నాడు"అబ్బిరెడ్డిని ఆలా తిట్టడమే కాకుండా తనకు సపోర్టుగా నిలబడినందుకు ఉప్పొంగిపోతూ.

"అట్టా మాటాడిండా "అశ్చర్యంతో పాటు సంతోషంకూడ కలిగింది. భార్య కూతుర్లకు .హాస్టలు నుండి ఇంటికి వచ్చిన కొడుకు నరేంద్ర మరింత ఉత్సాహ పడుతూ" నాయనా మీరు సెప్తుంటే రుద్రన్నతో ఒపారి కలసి మాటాడాలని ఉందినాయనా" అన్నాడు.

"ఆ మల్లా. ఆరైసారుగూడా అచ్చర్యపోయిండు. అతని దోస్తులు , అబ్బిరెడ్డితో ఎందుకు గొడవ అనిండ్రు అట్టా మాటాడితే ఎట్టారా ఆ పిల్లగాడ్ని నాకు సగయాం సేయకుండా సేయాలని సూసిండ్రు. వాళ్లేం సెప్పినా ఆయన మాట తీరు మారలా మీరేం భయపడమాకండి వోడితో అట్టాగానే మాటాడాలనిండు. పులిబిడ్డే. "

మరో సారి అడిగాడు నరేంద్ర తను ఆఫీసు దగ్గరికి వస్తానని. " నువెందుకులేరా ఆడికి. కాలేజుంటాది గందా నువెళ్లు.ఇంకా భెయపడాల్సిన పనిలేదనిపిస్తాండాది. ఆ పిల్లోడు తోడుండి అమ్మోరి దయవల్ల పొలంలో నీళ్లు తగ్గేసి పంట

చేతికొచ్చి , ఆపైన పొలం మన పేరనొస్తే కొనేదానికి ఎవడో ఒకడు వస్తడు. ఎకరం అమ్మి పెద్దదాని పెళ్లి సేసేస్తే నెత్తిమీద పెద్ద బరువు తగ్గినట్లైతాది. నీ సదువు అయిపోయి నీకు ఉజ్జోగం వస్తే ఇంగ ఏ బాధుండదు" జరగబోయేదాన్ని మంచిగా ఊహిస్తూ. పేదోడు అంతకన్నా పెద్ద కలలు కనేందుకు క్కూడా సాహసం చేయదేమో అనుకొంది మిణుకు మిణుక్కు మంటు వెలుగుతున్న బల్బు.

రోజుకన్నా రెండు ముద్దలు ఎక్కువగానే తృప్తిగా భార్య పిల్లల్తో కలిసి తిన్నాడు వరదయ్య. చాలా రోజులు తర్వాత సంతోషంగా అందరు కలిసి తినడంతో పాటు సంతోషంగా ఉండటంతో వరదయ్య భార్య, " మనులొద్దు మానిక్యాలొద్దు అంకాలమ్మ తల్లి ఎప్పుడు నేను నా మొగుడు పిల్లలు ఎప్పుడు ఇట్టాగా సంతోషంగుండాలి" అని దండాలు పెట్టుకొంది.

రేపేం జరుగబోతుందో తెలియని వరదయ్య తిన్న ఎంగిలి కంచం దగ్గరే కొద్దిగా పక్కకు సర్దుకొని కూర్చొని రెండు బీడిలు తాగేసి లేచి నులకమంచం మీద పడుకొని, రెండు నిమిషాల్లోనే నిద్రలోకి జారుకొన్నాడు. ఆనిద్రలో ఆఫీసు కనపడింది. రుద్ర అతని దోస్తులు చాలమంది కత్తుల్తో కొడవల్తో రావడం , వాళ్లను చూచి అబ్బిరెడ్డి సోమిరెడ్డి వెంట వచ్చిన మనుష్యులు జారుకోగా అబ్బిరెడ్డి సోమిరెడ్డి బిక్కచచ్చిపోయి చెమటలు కార్చుకొంటున్నట్లు. తహశిల్దారు ముందు బింకంగా మాట్లాడినా రుద్ర నిలదీసి మాట్లడుతుంటే తహశిల్దారు మాటలు రాక తలదించుకొని పొరపాటు అయిపోయింది అని వెంటనే సరిచేస్తాను అని చెప్పి అప్పటికప్పుడు తన పేరు పుస్తకాల్లోను కంప్యూటర్లోను మార్పుచేస్తున్నట్లు , అదిచూసి అబ్బిరెడ్డి తహశిల్దారుకు అడ్డుచెప్పపోతే నేను ఏమి చేయలేను నా ఉద్యోగానికి ముప్పు వస్తుందని తహశిల్దారు తెగేసిచెప్పడంతో ఏమి చేయలేక అబ్బి రెడ్డి సోమిరెడ్లు దిగాలు ముఖమేసుకొని అక్కడ్నుంచి పోతున్నట్లు , సోమిరెడ్డి పొలంలో కాలువ తీయగా తన పొలంలో నీళ్లు పూర్తిగా తగ్గిపోయినట్లు , ఇక నీకేం భయం లేదు ఏమైన జరిగితే నాకు చెప్పు అంటూ రుద్ర భరోసా ఇస్తున్నట్లు కలలు కనసాగాడు.

ఆకాశంలో పౌర్ణమి నాటి చంద్రుడు చల్లని వెన్నెల కురిపిస్తున్నాడు. రేపటి రోజు తను తరిగిపోయేదాన్ని పట్టించుకోకుండా.

అదే సమయంలో అబ్బిరెడ్డి ఉద్రేకంతో ఊగి పోసాగాడు. ఒక చోట స్తిమితంగా కూర్చోలేదు. అటు ఇటూ తిరుగుతున్నాడు. టీపాయి మీద ఉన్న మందు ఫుల్ బాటిల్ సగం పైనే అయిపోయింది. నీళ్లు, సోడా కలపుకోకుండా రా నే తాగుతున్నాడు. మండలంలో ఎవరైనా తనతో మాట్లాడాలంటే భయపడే వాళ్లనే చూసాడు. అంతే కాదు నియోజక వర్గంలో తను రాజకీయాల్లోకి వచ్చినప్పటినుండి తను తిట్టడం వరకే తెలుసు ఎదురెత్తి మాటాడే వాళ్లను చూడలేదు అలాంటిది ముక్కుమొఖం తెలియని వాడు తన మండలంలోని వాడేనని చెప్తూ తన చెమడాలు తీస్తానని అరే అంటే అరే అరే రేపు రా నీ కథ చూస్తాం అనడం అనడం జీర్ణించుకోలేక పోతున్నాడతను. ఇన్ని సంవత్సరాల రాజకీయ జీవితంలో అలాంటి అవమానం జరగలేదు ఎప్పుడు అతనికి " పిఏ కాడ్నించి ఫోన్ తీసుకోకుండా ఉంటే సరిపోయిండేది. ఇంత అవమానం

జరిగిందేది కాదు. వాడి చేత మాటలు పడాల్సిన పని ఉండేది కాదు. తనెవరో వోడికి తెలిసినా వోడు అట్టా మాట్లడిడంటే ఎవరోడు.ఎక్స్ పార్టి వాడా. ఆ పార్టీలో అంత దమ్మున్నవాడెవడు. ఏ ఊరోడు వోడు " అనుకొంటూ వెంటనే ఆఫీసు దగ్గరికి మనుష్యుల్ను పంపాడు. వాడెవరైనా ఈడ్చుకరమ్మని.పోయిన వాళ్లు అక్కడ ఎవరు లేరని పరమేశం కూడా ఆఫీసు దగ్గర ఇంటి దగ్గరలేడని , కంప్యూటర్ ఆపరేటర్కు కూడా వాళ్లు ఏ ఊరి వాళ్లో తెలియదన్నాని వట్టి చేతుల్తో తిరిగి రావడంతో అబ్బిరెడ్డి కోపమంతా సోమిరెడ్డి మీదికి పోయింది. ఇష్టమెచ్చినట్లు బండ బూతులు తిడ్తూ "గబ్బునాకొడకా నీ కోసరం వోడెవడో అడ్డమైనా నా కొడుకు సేత మాటలనిపించుకొన్నా సిగ్గులేకుండా ఈడ్నే నా పక్కనే నిలబడి సచ్చినవు. సీము నెత్తుర లేదేంరా లేక నన్ననాలా నాకేమి కాలే అని ఊరకుండావా?"

"అదేదేందన్నా అట్టా తీసిపారేస్తవు. నన్నన్నా పర్వాలా నిన్ను అన్ని మాటలన్నాడని తెలిసిన కాడ్నించి నా రకతం మరుగుతుండాది. గాని ఏం సేయాలా వోడెవడో తెలిక పాయే. రేపొస్తాడుకందా వోడ్ని ఆడ్నే మక్కెలిరగదన్నిస్తాం. దాంతో ఇంకోకడికి బెయముంటాది"

"వాడెవడో తెలీకుండా యాడికి పోతాదిరా. తెలుస్తాది. అంతదాక సేతులు ముడుచుక కూకోవాలా. ఆ వరదయ్యగాడి కోసరమే గందా వోడట్టా మాటాడినేది. ఆ వరదయ్యగాడ్ని ఎదో ఒకటి సేయ్ వోడి దిమ్మ తిరుగుతాది.. అప్పుడు వీడు వోడు ఎవడికి సెప్పుకొంటరో ఏం పీకుతారో సూస్తా. నాకొడుకులు. ఎళ్లు ఎళ్లి ఎదో ఒకటి సెయ్యి" అని రంకెలేసాడు అబ్బిరెడ్డి.

"ఏం సేయమంటావన్న.... " దిక్కుతోచక అడిగాడు సోమిరెడ్డి.

"గబ్బునాకొడకా అది నేనే సెప్పాలా దున్నపోతులాగా వళ్లు పెంచినవు. ఆ మాత్రరం తెలీదురా వరదయ్యగాడికి పొలమంటే పాణం. దాన్నే నాసనం సేయించేయ్. పొద్దుగల్లా వోడు పొలం సూసి ఆడ్నే సావాల నా కొడుకు. అప్పుడు బుద్దొస్తాది ఆ నాకొడుక్కు వోడికి సపోర్టు సేసినోడికి ఈ అబ్బిరెడ్డి అంటే ఏందో. ఎళ్లు ఎళ్లి రాతిరికి రాతిరే ఆ పని అయిపోవాల. నువ్వు సేస్తావో సేయిస్తా వో నాకు తెలీదు పని మాత్తరం జరిగిపోవాల. ఒకేలా ఆ పని సేసేటప్పుడు ఆ వరదగాడు అడ్డువచ్చినాడంటే వోడ్ని పొలం కాడ్నే నరకి బూడ్చేయ్ నాకొడుకును. ఆ పైన నేను సూసుకొంటా వోడి కోసరమే గందా నన్ను వోడన్ని మాటలన్నాది" ఆవేశంతో ఊగిపోతున్న అబ్బిరెడ్డిని చూస్తూ సోమిరెడ్డికి ఏం చేయాలో పాలుపోక కళ్లప్పగించి చూస్తుంటే ,

"అట్టా బిక్కమొహమేస్తావేందిరా సెత్త నాకొడకా సేస్తావా సేయలేవా ఆపని" అని ఆవేశంగా తన మీదికి వస్తున్న అబ్బిరెడ్డిని చూచి మీద పడి ఎక్కడ కొడ్తాడో నని "అట్టాగే నన్నా సేయలేకేం...సేస్తా " అంటూ బైటపడ్డాడు సోమిరెడ్డి అక్కడ్నుంచి.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS